క్లుప్తంగా

ప్రజలంతా సంతోషంగా ఉండాలి

ప్రత్తిపాడు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: విఘ్నాలను తొలగించే దేవుడు విఘ్నేశ్వరుడని ప్రజల విఘ్నాలన్నీ తొలగి ఈ వినాయకచవితి నుంచి ప్రజలు సంతోషంగా ఉండాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇంచార్జ్ బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. వినాయక చవితి సందర్భంగా నియోజకవర్గం ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మట్టి వినాయకుడిని పూజించి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని సూచించారు.

ట్రాక్టర్ ఢీకొని విద్యార్థికి తీవ్రగాయాలు



గుంటూరు రూరల్: డ్రైవర్ మద్యం మత్తులో మితిమీరిన వేగంతో ట్రాక్టర్‌ను నడుపుతూ సైకిల్‌పై వెళుతున్న విద్యార్థిని ఢీకొనటంతో విద్యార్థికి తీవ్రగాయాలైన సంఘటనలో నల్లపాడు పోలీస్ స్టేషన్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. నల్లపాడు పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం గోరంట్ల గ్రామానికి చెందిన తాడేపల్లి సాయిశ్రీచరణ్ నగరాలులోని ఒక ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం సమయంలో స్కూలు నుంచి ఇంటికి తన సైకిల్‌పై వెళుతుండగా గోరంట్ల గ్రామంలో మితిమీరిన వేగంతో వస్తున్న ట్రాక్టర్ ఢీకొంది. దీంతో విద్యార్థి తీవ్ర గాయాలవగా స్థానికులు అప్రమత్తమై విద్యార్థిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. డ్రైవర్ పరారయ్యేందుకు ప్రయత్నించగా స్థానికులు అతన్ని పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. సంఘటనపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఆసుపత్రిలో తీవ్రగాయాలైన విద్యార్థి కాలును తొలగించాల్సి వచ్చిందని ఎన్నో ఆశలతో పెంచుకుంటున్న కొడుకు నేడు వికలాంగుడయ్యాడని విద్యార్థి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆర్‌వీఆర్‌జేసీలో ర్యాగింగ్ వ్యతిరేక అవగాహన మహోత్సవ్



గుంటూరు రూరల్: ర్యాగింగ్ అనే పాశవిక చర్యను విడనాడి, స్నేహపూరిత వాతావరణంలో విద్యార్థుల విద్యాభ్యాసం కొనసాగిస్తూ, భవిష్యత్ తరాలకు ఆదర్శంగా నిలవాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. జాతీయ ర్యాగింగ్ వ్యతిరేక దినోత్సవ వేడుకల్లో భాగంగా చౌడవరం గ్రామంలోని కళాశాలలో కళాశాల యాంటీ ర్యాగింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఎస్సే రైటింగ్, ఎలక్యూషన్, పోస్టర్ ప్రెజెంటేషన్, క్విజ్ పోటీల్లో విద్యార్థులు ర్యాగింగ్ వల్ల జరిగే నష్టాలను వివరించారు. పోటీల్లో ప్రతిభను కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు బహుమతులను సర్టిఫికెట్లను అందజేశారు. ర్యాగింగ్ అనేది తీవ్రమైన నేరమని, అది విద్యార్థుల భవిష్యత్‌ను దెబ్బతీస్తుందని, ప్రతి విద్యార్థి ఫ్రెండ్ నాట్ ఫియర్ అనే భావనతో ముందుకు సాగాలని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ర్యాగింగ్ నిర్మూలనలో ప్రతి విద్యార్థి భాగస్వామి కావాలని, శ్రద్ధ, క్రమశిక్షణ, స్నేహం, సహకారం అనేవి నిజమైన విద్యార్థి లక్షణాలని పేర్కొన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, యాంటీ ర్యాగింగ్ కమిటీ కన్వీనర్ డాక్టర్ ఎం.సత్యసాయిరాం, కమిటీ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

కళాశాలలో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ప్రతిమల తయారీ కళాకారులచే చేయబడుతున్న మట్టి విగ్రహాల తయారీలో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, స్వయంగా తయారు చేసి గొప్ప అనుభూతిని పొందారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మట్టి వినాయకులను పూజించాలని ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది పేర్కొన్నారు.

పేకాట రాయుళ్లు అరెస్ట్

చిలకలూరిపేటటౌన్: మండలంలోని గొట్టిపాడు గ్రామ పొలాల్లో పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను మంగళవారం చిలకలూరిపేట రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. రూరల్ స్టేషన్ ఎస్‌ఐ జి అనిల్‌కుమార్ సిబ్బందితో కలిసి గొట్టిపాడు గ్రామ శివారున పొలాల్లో పేకాట శిబిరంపై ఆకస్మిక దాడులు చేశారు. ఈ తనిఖీల్లో కొందరు కోత ముక్క ఆడుతున్నట్లు గుర్తించారు. పేకాట ఆడుతున్న ఆరుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ. 5,420 నగదును స్వాధీనం చేసుకున్నారు.

హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన

వినుకొండ: హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ టార్గెటెడ్ ఇంటర్వెన్షన్ ఆధ్వర్యంలో పట్టణంలోని బాలుర హైస్కూల్‌లో హెచ్‌ఐవీ, ఎయిడ్స్, మత్తు పదార్థాల వినియోగం విరమణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు చెన్నపరెడ్డి, ఐసీటీసీ కౌన్సిలర్ సురేష్‌లు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని, డ్రగ్స్ వినియోగం చట్టరీత్యా నేరమని తెలియజేశారు. ఆషా, ఎల్‌టీ రోజా, స్టాఫ్‌నర్స్ కళావతి, జయ, పీఈలు జక్రయ్య, రమేష్, విజయ తదితరులు పాల్గొన్నారు.

చిట్టి మనసులు.. చక్కని గణపతులు









చిన్నారులలో పర్యావరణ అనుకూల ఆలోచనలను పెంపొందించేందుకు మట్టి వినాయకుని పూజిద్దాం భూమాతను రక్షిద్దాం అంటూ వివా ది స్కూల్ నందు మంగళవారం విద్యార్థులకు మట్టిగణపతి విగ్రహాల తయారీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపాధ్యాయులు విగ్రహాల తయారీ విధానాన్ని విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న 400 మంది విద్యార్థులు అందమైన వినాయక విగ్రహాలను తయారు చేశారు. నిర్ణీత సమయంలో ఆకర్షణీయ విగ్రహాలను తయారు చేసిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ప్యాస్టాప్యారిస్ కెమికల్ రంగులతో తయారు చేసే విగ్రహాల వల్ల పర్యావరణానికి హాని కలుగుతుందని, సాంప్రదాయక మట్టి వినాయక విగ్రహాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించాలని విద్యార్థులకు ఉపాధ్యాయులు సూచించారు. ఈ కార్యక్రమంలో వివా డైరెక్టర్ ఎలేటి కమాండర్ కె శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ సిహెచ్ సరళ, ఐబి సంధానకర్త కె మాధవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వినాయక విగ్రహాలను పూజించడంపై పెదకాకాని సెంట్ జోసఫ్స్ విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్యాస్టాప్యారిస్‌ను ఉపయోగించటం వలన జరిగే అనర్థాలను వివరించారు. మట్టి గణపతి బొమ్మలను ఉపయోగించటం వలన పర్యావరణానికి చాలా ఉపయోగకరమని నినాదాలు ఇస్తూ, ర్యాలీని నిర్వహించారు. 500 మంది విద్యార్థులచే మంగళవారం పెదకాకాని శివాలయం నుంచి పాఠశాల వరకూ నడుస్తూ ర్యాలీని నిర్వహించారు. ఈ ర్యాలీలో ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ సంధ్యారాణి ఉపాధ్యాయ బృందం, ఉపాధ్యాయేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

– పెదకాకాని

మట్టి ప్రతిమలనే పూజిద్దాం !

- బజరంగ్ అర్బన్ ఇన్ఫ్రా లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అంబటి మురళీకృష్ణ
- బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాలుగు వేల మట్టి గణపతి విగ్రహాల పంపిణీ



మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న అంబటి మురళీకృష్ణ



మట్టి గణపతితో యువతి

కొరిటిపాడు(గుంటూరు): పర్యావరణాన్ని కాంక్షిస్తూ బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టాభిపురంలోని గ్రీన్ గేస్ ప్రాజెక్టు ఆవరణలో నాలుగు వేల మట్టి గణపతి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బజరంగ్ అర్బన్ ఇన్ఫ్రా లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా పట్టణ ప్రజలకు బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మట్టి వినాయక ప్రతిమలను పూజించి, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వినాయక చవితిని ప్రజలందరూ కలిసి జరుపుకునే పవిత్రమైన పండుగ అని పేర్కొన్నారు. ప్రతి ఏడాది మాదిరి ఈసారి కూడా ప్రజల నుంచి విశేష స్పందన ఉందని తెలిపారు. జీవ వైవిధ్యాన్ని కాపాడటంలో భాగంగా అనేక కార్యక్రమాలు చేస్తూ తమవంతుగా కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమాలను ఇక ముందు కూడా పెద్ద ఎత్తున కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో బజరంగ్ అర్బన్ ఇన్ఫ్రా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు సిద్ధినేని శ్రీనివాసరావు, సమీర్ నందన్, జి.సుబ్బారావు, ప్రాజెక్టు మేనేజర్ దుర్గై, సుష్మ స్వరాజ్, నూకల చంద్రశేఖర్, సంధ్యాదేవి, జ్యోతి, కార్యాలయం సిబ్బంది, ఇంజినీర్లు పాల్గొన్నారు.

మట్టి గణనాథుడినే పూజిద్దాం



వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న కళాశాల యాజమాన్యం



వినాయక మట్టి విగ్రహాలు పంపిణీ చేసిన రోటరీ క్లబ్ సభ్యులు

గుంటూరు రూరల్: మట్టి వినాయక ప్రతిమలను పూజించి పర్యావరణాన్ని కాలుష్యం బారినుంచి కాపాడుదామని చలపతి ఇంజనీరింగ్ కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ వై.సుజిత్‌కుమార్ తెలిపారు. మంగళవారం వినాయక చవితి పర్వదినాల సందర్భంగా నగరంలోని లక్ష్మీపురం బృందావన్‌గార్డెన్స్, పట్టాభిపురం తదితర ప్రాంతాల్లో కళాశాల విద్యార్థులు మట్టి వినాయక ప్రతిమలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ రసాయనాలతో తయారైన రంగులతో తయారు చేసిన ప్రతిమలను పూజించవద్దని తద్వారా నీరు, గాలి, పర్యావరణం కాలుష్యమౌతుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ మట్టి ప్రతిమలను పూజించి ఇంటిలోని మొక్కలవద్దే నిమజ్జనం చేసుకోవచ్చని సూచించారు. అనంతరం ప్రజలకు వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ ఏ.బాలాజీ, డాక్టర్ కె.వెంకటరామారావు, నాగగోపి, పి.వెంకటనరేంద్ర, జె భార్గవ్, డైరెక్టర్ డి.వినయ్‌కుమార్, డి.తిరుపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో..

పొన్నూరు: పర్యావరణ పరిరక్షణలో భాగంగా రోటరీ క్లబ్ ఆఫ్ పొన్నూరు ఆధ్వర్యంలో వినాయకచవితి పురస్కరించుకుని మంగళవారం పట్టణంలో వినాయక మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రొటేరియన్ డాక్టర్. రాఘవేంద్రరావు, క్లబ్ ప్రెసిడెంట్ జి.ఎం.ఎస్. గుప్తా, కార్యదర్శి వీరయ్య యాసం, సభ్యులు తోట భాను ప్రసాద్, బండారుపల్లి శ్రీనివాసరావు, రాధాకృష్ణ, బాలకృష్ణ, రామకృష్ణ, రాజేంద్ర చౌదరి, ఎం.ఎం. కుద్దూస్, బోడపాటి రామారావు పాల్గొన్నారు.

సాంకేతికత, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి

సెయింట్ ఆన్స్‌లో స్కిల్స్‌పై శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులతో యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థి ఆధునిక ప్రపంచంలో ఎప్పటికప్పుడు సాంకేతికత, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపల్ రెవరెండ్ సిస్టర్ డాక్టర్ టి.సంధ్య తెలిపారు. గోరంట్లలోని కళాశాలలో నాంది ఫౌండేషన్ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా సాఫ్ట్‌స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్‌లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. మంగళవారం ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ జీవితంలో ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కొనేందుకు స్కిల్స్ ఎంతో ఉపయోగపడతాయన్నారు. నాంది ఫౌండేషన్ సౌత్ జోనల్ అధికారిణి శ్రీలక్ష్మి చేతుల మీదుగా శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. ప్రతి విద్యార్థి ఇటువంటి అవకాశాలను సద్వినియోగించుకోవాలని ఆమె తెలిపారు. కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ జె. ప్రతాప్‌రెడ్డి, ఆర్.షారోన్‌రోజ్ పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

గుంటూరు రూరల్: చిన్న అలవాటుగా మొదలై, ప్రమాదకర వ్యసనంగా మారి, ఆరోగ్యాన్ని హరించే డ్రగ్స్ వాడకానికి యువత దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ విద్యార్థులకు సూచించారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు గ్రామంలోగల కిట్స్ కళాశాలలో మంగళవారం ఎన్.ఎస్.ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు డ్రగ్స్, సైబర్ క్రైమ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ హాజరయ్యారు. యువతను చెడు మార్గం పట్టిస్తున్న మత్తు పదార్థాల వినియోగం రోజురోజుకూ పెరుగుతుందన్నారు. వాటిని తీసుకున్న యువత జీవితాలను నాశనం చేసుకుంటుందని చెప్పారు. వీటి నుంచి యువతను దూరం చేసేందుకు ఇంజినీరింగ్ సహా అన్ని ఉన్నత విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇటీవల కాలంలో సైబర్ మోసాలు బాగా పెరిగిపోయాయన్నారు. స్కామర్ల బారిన పడకుండా ఉండాలంటే.. స్పందించే ముందు సమాచారాన్ని ధృవీకరించుకోవాలని చెప్పారు. స్కామర్లపై ఫిర్యాదు చేసేందుకు నేషనల్ కన్సూమర్ హెల్ప్ లైన్ (1800-11-4000), సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌కు గానీ, స్థానిక పోలీస్ స్టేషన్‌కుగానీ తెలియజేయాలన్నారు. సౌత్ డివిజన్ డీఎస్పీ జి భానోదయ, చైర్మన్ కోయ సుబ్బారావు, కార్యదర్శి కోయ శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి బాబు, అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ కె హరిబాబు, సీఐ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్లపై కంకర పడకుండా పరదాలు కప్పుకోవాలి



కంకర ట్రాక్టర్లు పరదాలు కప్పుకోవాలని తెలుపుతున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: కంకర ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు తప్పనిసరిగా నగర పరిధిలో రోడ్ల మీద కంకరపడకుండా ట్రక్‌లపై పరదాలు ఏర్పాటు చేసుకోవాలని, లేకుంటే రోడ్ల మీద పడిన రాళ్లవల్ల వాహనాల రాకపోకలకు, పారిశుద్ధ్య పనులకు తీవ్ర ఆటంకంగా ఉంటుందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం నల్లపాడు, హౌసింగ్ బోర్డ్ కాలనీ, ఎన్జీఓ కాలనీ, ఏటిఅగ్రహారం ప్రాంతాల్లో పర్యటించి పారిశుద్ధ్యం, అభివృద్ధి పనులను పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిర్మాణ పనుల కోసం కంకర, ఇసుక తరలించే వాహనాలు ట్రక్‌లపై ఏవిధమైన కవర్ చేయకపోవడం వలన రోడ్ల మీద పడి ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. కనుక తప్పనిసరిగా ట్రక్‌లపై పరదాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నల్లపాడులో పలు ప్రాంతాల్లో పర్యటించి, సచివాలయ కార్యదర్శులతో మాట్లాడుతూ సచివాలయం పరిధిలో ప్రజలకు కార్యదర్శులు జవాబుదారీగా ఉండా లన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. నూతన రోడ్లు లేదా డ్రైన్ల నిర్మాణాలు చేయాల్సి ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం కంకరగుంట ఆర్యూబి దగ్గర రైల్వే ట్రాక్ వైపు వ్యర్థాలు ఉండడం గమనించి సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేసి, సదరు ప్రాంతంలో వ్యర్థాలు పడకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యటనలో కార్పొరేటర్ చల్లా రాజ్యలక్ష్మి, ఇన్‌చార్జి ఎస్ఈ సుందరరామిరెడ్డి, ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ వెంకటరమణ, పట్టణ ప్రణాళిక, ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇంటిని కూల్చేశారు .. న్యాయం చేయండి

గుంటూరు రూరల్: ఆరుగాలం కష్టపడి దాచుకున్న సొమ్ముతో కట్టుకున్న మాఇంటిని కూల్చేశారని తమకు న్యాయం చేయాలని బాధితులు నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఏటుకూరు గ్రామానికి చెందిన బాధితుడు అమృతరావు తెలిపిన వివరాల ప్రకారం వారసత్వంగా తమకు కలిగిన ఆస్థిలో తాము ఇంటిని నిర్మించుకోగా పక్కనే ఉండే ఏటుకూరి స్వామిదాసు, ఏటుకూరి శ్రీపతి, ఏటుకూరి అమృతరావు, ఏటుకూరి మస్తాన్‌రావులు మరో పది మందితో కలిసి తమ ఇంటివద్దకు వచ్చి అడ్డువచ్చిన తనను కొట్టి బలవంతంగా తన ఇంటిని కూల్చివేశారని అదేమని అడిగితే చంపేస్తామని బెదిరిస్తున్నారని ఫిర్యాదు చేశాడు. పోలీసులకు ఫిర్యాదు చేసినా బయటకు వచ్చిన తరువాత మీ పనిచూస్తాం అంటూ బెదిరించారని వారివల్ల తమకు ప్రాణహాని ఉందని అమృతరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నల్లపాడు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్డీఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నూతన కమిటీ ఎన్నిక

పెదకాకాని (ఏఎన్‌యూ): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నేషనల్ దళిత్ స్టూడెంట్ ఫెడరేషన్ ఎన్‌డీఎస్ఎఫ్ విద్యార్థి సంఘం 2025–26 విద్యా సంవత్సరానికి మంగళవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా డి.దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడిగా ఎల్.రఘువంశ ప్రసాద్, కార్యదర్శిగా జి ప్రశాంత్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా బి.లోకేష్, కార్యనిర్వాహక కార్యదర్శిగా వి.శ్యాంసుందర్, కోశాధికారిగా ఆర్.కావ్యలతోపాటు మరొక 13 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ యూనివర్సిటీలో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు, విద్యతో పాటు నైపుణ్యాలు పెంచుకునేందుకు ప్రత్యేక సెల్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కోర్సు పూర్తయిన వారికి వెంటనే క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించేలా అధికారులతో చర్చించి ఒక ప్రణాళిక బద్ధమైన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు విద్యార్థుల సంక్షేమం కోసం తమవంతు కృషి చేస్తామన్నారు.

వ్యవసాయ శాఖ సూచనలు పాటించాలి

పొన్నూరు: మండలంలోని మామిళ్ళపల్లి, ఆరెమండ గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్య క్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి ఆర్. వెంకటేశ్వరరావు పాల్గొని పంట పొలాలను సందర్శించి రైతులకు వ్యవసాయ సూచనలు వివరించారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నగదు జమకాని వారు రైతు సేవా కేంద్రాలలో సిబ్బందిని ఆధార్‌కార్డుతో సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. వ్యవసాయ సహాయకులు మాణిక్యరావు, ఎంపీఈఓ సురేష్‌బాబు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

పొన్నూరు: పట్టణం, మండలంలోని ఎరువుల దుకాణాలు, సహకార సంఘాలను శనివారం మంగళవారం తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్, పట్టణ సిఐ వీరానాయక్, మండల వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు చేశారు. రికార్డులను పరిశీలించి, యూరియా, డీఏపి నిల్వలను పరిశీలించారు. రైతు సేవా కేంద్రాలు, సహకార సంఘాల ద్వారా అవసరం మేరకు ఎరువులు సరఫరా చేయనున్నట్లు అధికారులు రైతులకు భరోసా కల్పించారు. ప్రస్తుతానికి 630 మెట్రిక్ టన్నుల యూరియా, 592 మెట్రిక్ టన్నుల డీఏపీ ఎరువుల కోసం నివేదికలు పంపినట్లు ఏవో తెలిపారు. నానో యూరియా, నానో డీఏపీలను వినియోగిస్తే మంచి దిగుబడులు వస్తాయన్నారు. వ్యవసాయ సహాయకులు పి మాణిక్యరావు ఎంపీఈఓ ఎస్ సురేష్ బాబు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనృసింహ కవచం శక్తివంతం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణవేదికపై మంగళవారం శ్రీలక్ష్మీ నృసింహ కవచంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. తొలుత ఆలయ పాలకవర్గం జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. సుందర సత్సంగ్ సభ్యులు కేవీ కోటేశ్వరరావు మాట్లాడుతూ శ్రీలక్ష్మీనృసింహ కవచం దుష్టశక్తులు, దుష్ట కన్నులు, ఇతర ఆటంకాల నుంచి రక్షణ పొందేందుకు పఠించే ఒక శక్తివంతమైన స్తోత్రమని అన్నారు.